నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | మార్చి 15, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్యే సస్పెన్షన్ పట్ల బీఆర్ఎస్ నిరసన



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేను అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడంపై ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పిప్పిరి అంజనేయులు, జూకంటి ప్రభాకర్ రెడ్డి, గెరిగంటి లక్ష్మినారాయణ, కుంబాల రవి, బల్వంత్ రావు, భాను ప్రసాద్, మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐదో విడత నిజాంసాగర్ నీటి విడుదల



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువకు పది రోజులపాటు ఐదో విడత నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈఈ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీల నీటికి గాను ప్రస్తుతానికి ప్రాజెక్టులో 8.351 టీఎంసీల నీరు నిలువ ఉంది. కాలువలోకి నీటిని వదులుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాలువలోకి ఎవరు కూడా దిగొద్దని ఆయన సూచించారు. ఎండలు విపరీతంగా కొడుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు.



రంగుల చేతులు చూపుతూ సంబురపడుతూ కేరింతలు కొడుతున్న పిల్లలు

పోలీస్‌కస్టడీలో వ్యక్తి మృతి

- పోలీసులే కొట్టి చంపారు : కుటుంబీకుల ఆందోళన
- గుండెపోటుతో మృతి : సీపీ సాయిచైతన్య
- విచారణ చేపట్టి దోషులను శిక్షించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ కస్టడీలో ఉన్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. కాగా పోలీసులే తీవ్రంగా కొట్టి హింసించడంతోనే మృతిచెందినట్టు కుటుంబీకులు ఆరోపించారు. అయితే విచారణలో నేరం అంగీకారం తెలిపాడని కాగా ఎడమచేతి నొప్పి ఉందని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడే గుండెపోటుతో మృతిచెందినట్టు సీపీ సాయిచైతన్య ప్రకటన విడుదల చేశారు. అయితే యువకుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లాకు చెందిన సంపత్ (34).. జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పేరుతో పలువురిని ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం పంపించాడు. సంపత్ ద్వారా గల్ఫ్ దేశం దుబాయికి వెళ్లిన కొందరికి పని లేక ఇబ్బందులు పడ్డారు. తమను సంపత్ కావాలనే నకిలీ వీసాలపై పంపించి మోసం చేసాడని బాధితులు నిజామాబాద్ జిల్లాలోని సైబర్ క్రైం పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుపై స్పందించిన నిజామాబాద్ సైబర్ క్రైం పోలీసులు సంపత్‌తో పాటు ఇంకొక వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా విచారణ నిమిత్తం ఈ నెల 12వ తేదీనా పోలీసులు తమ కస్టడికి తీసుకు న్నారు. విచారణలో భాగంగా గురువారం విచారణ నిమిత్తం జగిత్యాలలో సంపత్ నిర్వహిస్తున్న కన్సల్టెన్సీకి కూడా తీసుకెళ్లారు. రాత్రి సమయంలో నిజామాబాద్ కు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యలో పోలీస్ కస్టడీలో ఉన్న సంపత్ అస్వస్థతకు గురవడంతో పోలీసులు నిజామాబాద్ నగరంలోని జీజీహెచ్‌కు తరలించినట్లు సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సంపత్ మృతి చెందినట్లు చెబుతున్నారు.



మృతిచెందిన సంపత్

పోలీసులు సంపత్ అస్వస్థకు గురైనట్లు, ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ఉదయం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో సంపత్ మృతదేహాన్ని చూసి భోరుమన్నారు. కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి వద్ద రోడ్డుపై ఆందోళనకు దిగారు. అన్యాయంగా తన భర్తను అరెస్ట్ చేసి తీవ్రంగా కొట్టడంతోనే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. తన భర్తను అరెస్ట్ చేసి తీసుకొచ్చిన పోలీసులు మృతదేహాన్ని అప్పగిస్తున్నారని మృతుడు భార్య బోరున విలపించింది. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని మృతుడి బంధువులు, సభ్యులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన కుటుంబీకులు, బంధువులు

మృతిపై కేసు నమోదు.. విచారణ చేపడుతున్నాం

ఈ సమాచారం అందిన తరువాత నిజామాబాద్ లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 196 కింద క్రైమ్ నంబర్ 101/2025లో ఎస్ఐఆర్ నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు. దర్యాప్తును డీఎస్పీ స్థాయి అధికారి నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన పై పూర్తి వివరాలను మానవ హక్కుల కమిషన్‌కు కూడా సమాచారాన్ని సక్రమంగా అందజేశామని సీపీ తెలిపారు. సంపత్ మృతి ఘటన పై జ్యుడీషియల్ ఫస్ట్-క్లాస్ మెజిస్ట్రేట్ ద్వారా జ్యుడీషియల్ విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ముగ్గురు ఫోరెన్సిక్ నిపుణులైన వైద్యుల బృందం పోస్ట్ మార్టం పరీక్ష (పీఎంఈ) ను నిర్వహిస్తుంది. ఇది పూర్తి పారదర్శకత కోసం ఆడియో - వీడియో రికార్డ్ కూడా చేసినట్టు తెలిపారు. దర్యాప్తు పూర్తిగా అత్యున్నత స్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నారని, చట్టపరమైన, విధానపరమైన అన్ని ప్రోటోకాల్ ను అనుసరిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు.

గుండెపోటుతోనే మృతి చెందాడు : సీపీ

నిందితుడు సంపత్ గుండె పోటుతోనే మృతిచెందినట్టు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. అమాయక గ్రామీణ యువకులను, నిరుద్యోగులను ప్రలోభపెట్టి థాయిలాండ్, మయన్మార్ లతో పాటు లావోస్ కు పంపినందుకు నిందితుడు ఆలకుంట సంపత్‌పై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (సీసీపీఎస్) లో క్రైమ్ నంబర్ 10/2025లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. తదుపరి విచారణ కోసం న్యాయస్థానం ఆదేశాలను అనుసరించి నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారని పేర్కొన్నారు. తరువాత మార్చి 12న సంపత్‌ను పోలీసు కస్టడీకి తీసుకున్నారని వివరించారు. సీసీపీఎస్ పోలీసులు దర్యాప్తులో నిందితుడు ఆలకుంట సంపత్ తన పై నమోదైన కేసుల్లో స్వచ్ఛందంగా నేరంలో తన ప్రమేయాన్ని అంగీకరించాడని తెలిపారు.

తన కార్యాలయంలో రెండు మొబైల్ ఫోన్‌లు దాచిపెట్టడంతో అతని అంగీకారంతోనే జగిత్యాలకు ప్రయాణమవడం, మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం, తిరిగి నిజామాబాద్ కు తిరిగి రావడం వంటి మొత్తం ప్రక్రియను పట్టపగలు బహిరంగంగా పంచుల సమక్షంలో నిర్వహించామని సీపీ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతటా ఇద్దరు మధ్యవర్తులు నిందితులు వీరితో పాటు సీపీపీఎస్ అధికారులున్నారని తెలిపారు. మొబైల్ ఫోన్ ల స్వాధీనం ప్రక్రియలు పూర్తయిన తర్వాత నిందితుడిని ఈనెల 13 న రాత్రి 9.45 గంటలకు నిజామాబాద్ లోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు సంపత్‌ను సురక్షితంగా తిరిగి పంపించారని, అయితే ఆ రాత్రి తర్వాత, నిందితుడు అకస్మాత్తుగా తన ఎడమ చేయి లాగడం, అలసట, నొప్పి వంటి సమస్యల గురించి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో ఆవశ్యకతను గుర్తించిన పోలీసు సిబ్బంది వెంటనే అతన్ని వైద్య సహాయం కోసం నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు స్వయంగా ఆసుపత్రిలోకి నడుచుకుంటూ వెళ్లడం సీసీటీవీ ఫుటేజీల్లో స్పష్టంగా రికార్డు అయినట్టు తెలిపారు. కాగా రాత్రి 12.29 గంటలకు నిందితుడికి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో కుప్ప కూలిపోయాడని సీపీ తెలిపారు. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో చేసే సీపీఆర్ చికిత్సను కూడా అందించడానికి వైద్య బృందం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని, సంపత్ ను బ్రతికించలేకపోయారని తెలిపారు. మరణానికి కారణం తీవ్రమైన గుండెపోటు అని వైద్యులు నిర్ధారించారని సీపీ స్పష్టం చేశారు.

సమగ్ర విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)



పోలీసు కస్టడీలో చనిపోయిన సంపత్ మరణంపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పోలీసుల వ్యవహారం వల్లే చనిపోయినట్టు కుటుంబ సభ్యుల ఆరోపణలను దృష్టిలో పెట్టుకొని ఆయన మరణంపైన సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సంపత్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మరణించిన సంపత్‌కు నలుగురు చిన్నపిల్లలు ఉన్నారని, ఆయన మరణంతో ఆ కుటుంబం అనాథగా మారిందని, పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడే సంపత్ మరణించినందున ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని, తగిన నష్టపరి హారం చెల్లించాలని, ఆయన భార్యకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఊరు.. వాడ
రంగులమయం

- సంబురంగా రంగుల పండగ..
- కలర్స్ చల్లుకున్న చిన్నా.. పెద్ద
- జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన హోలీ పండుగ
- భారీ బందోబస్తు చేపట్టిన పోలీసులు



హోలీ వేడుకల్లో యువత

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వ్యాప్తంగా హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. హెూలీరే హెూలీ చమ్మకేలీరే హెూలీ అంటూ ఉదయం నుంచే రంగుల సందడి మొదలైంది. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు పూసుకుంటూ సంబురపడ్డారు. యువత గ్యాంగ్‌లుగా ఏర్పడి తోటి మిత్రుల ఇండ్లకు వెళ్తూ రంగులు పూస్తు వేడుకలు చేపట్టారు. వృద్ధులు తమ మనవరాళ్ళ, మనవళ్లకు రంగులు పూసి కుడకపేర, చక్కర పేర వేసి మురిసిపోయారు.

నిత్యం క్షణం తీరిక లేకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో గడిపే అధికారులు హెూలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మొదలుకొని గ్రామ అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల నాయకులు ఉత్సాహబరితమైన వాతావరణంలో హెూలీ పండుగను నిర్వహించుకున్నారు.

కాగా పండుగ సందర్భంగా వీధులు మొదలుకొని, కాలనీలు, అపార్ట్ మెంట్లు గ్రేటర్ కమ్యూనిటీల వరకు హెూలీ సంబరాలతో కోలాహలంగా మారాయి. ఉదయం నుంచే ఒకరినొకరు రంగులు చల్లుకుంటు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వీధులగుండా దప్పులతో పాటలు పాడుతు రంగులు పూసుకున్నారు. యువతులు తమతోటి వారికి రంగులు చల్లుకుంటూ హెూలీని నిర్వహించుకున్నారు. చిన్న పిల్లలు తోటిపిల్లలపై రంగునీళ్లను చల్లుకున్నారు. ఉదయం నుంచే స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద రంగులు పోసుకోవడంతో వీధులన్ని ఇంద్రధనస్సును తలపించాయి. పలు కాలనీల్లో సౌండ్‌బాక్సులు పెట్టుకొని డీజే పాటలతో డాన్స్ చేస్తూ హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

పోలీసుల బందోబస్తు

కాగా హోళీ వేడుకలు ప్రశాంతవాతావరణంలో ముగిసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బందోబస్తు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన చోట అదనపు పోలీసు బలగాలను మోహరించారు. కాగా మసీదుల వద్ద, ఈద్గాల వద్ద ప్రత్యేకంగా బందోబస్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పండుగ ప్రశాంతంగా ముగియడంతో పోలీస్‌శాఖ ఊపిరి తీసుకుంది.

ఏం ఎండలురా బాబోయ్..

- నీడపట్టున సేదతీరిన కోతులు



ట్రాక్టర్ స్టీరింగ్, ఇంజిన్‌పై సేదతీరుతూ..



రోజురోజుకు భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉక్కుపోతతో మనుషులతో పాటు అటు జంతువులు సైతం విలవిల లాడుతున్నాయి. ఎండ వేళ.. నీడను వెతుక్కుంటూ సేద తీరుతున్నాయి. ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఇంట్లోని ట్రాక్టర్ ఇంజిన్‌పై రెండు కోతులు ఆదమరిచి నిద్రించాయి. అటు పక్కన చెట్ల కొమ్మలపై సేదతీరుతుండగా.. నవతెలంగాణ 'కిస్సిక్' మనిపించింది.

ఫొటో : శ్రీకాంత్ యాదవ్. నవతెలంగాణ, ముప్కాల్

పిడిగుద్దుల వర్షం..



గుద్దుకుంటున్న గ్రామస్తులు

- పోలీసుల ఆంక్షల మధ్య హున్సాలో కొనసాగిన ప్రాచీన ఆట

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్సా గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు హోళీ సాంప్రదాయంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన పిడిగుద్దులాట దద్దరిల్లింది. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఇరువైపున పెద్ద దుంగలను కట్టి దానికి బలమైన తాడును కట్టారు. అనంతరం గ్రామంలోని కుల సంఘాల పెద్దలకు డప్పులతో వెళ్లి బొట్టుపెట్టి మరి ఆట వద్దకు ఆహ్వానించారు. ఆరు నిమిషాల పాటు హెూరాహెూరిగా పిడిగుద్దులాట సాగింది. ఈ ఆటను తిలకించడానికి సమీప గ్రామాల నుంచి ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. దాంతో గ్రామం ప్రేక్షకులతో కిక్కిరిసిపోయింది. కులాలకతీతంగా గ్రామస్తులు వచ్చి తాడును పట్టుకొని నిబంధనల మేరకు గుద్దుకోవడంతో ఆట రసవత్తరంగా కొనసాగింది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బోధన్ రూరల్ సిఐ విజయబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆరు నిమిషాల పాటు కొనసాగిన అనంతరం ఆట ముగిసింది. ఆట చివరి దశకు చేరగానే అందులో తాడును తొలగించడంతో ఆట ముగిసినట్లు భావించి ఆటగాళ్లు వెనుదిరిగారు. ఆటలో ఒకరికి ఒకరు కొట్టుకున్న గాని తిరిగి స్నేహభావంతో గ్రామస్తులు ఆలింగనం చేసుకొని ఆట నుంచి నిష్క్రమించారు. ఇద్దరుముగ్గురు గాయపడగా.. కాముడి బూడిద పూసుకొని వెళ్లిపోవడం గమనార్హం.

ఆకట్టుకున్న కోలాటం



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో అంగడి బజార్లో ప్రతి సంవత్సరం హెూలీ సందర్భంగా కోలాటం నిర్వహిస్తారు. కోలాటంను కొప్పులు చేసి ముడి కట్టి ఉంచుతారు. ఉగాది రోజు మళ్ళీ కోలాటం ఆడుతూ ఆ ముడిని కోలాటం ఆడుతూ తిప్పుతారు. వందల సంవత్సరాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. కోలాటం కళాకారులు చేసిన కోలాటం మండల ప్రజలను అమితంగా ఆకట్టుకుంది.

విప్లవ తాత్వికుడు కారల్‌మార్క్స్



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) నాయకులు

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్క్స్‌కు వర్ధంతి నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

బానిస సంకెళ్ల నుంచి విముక్తి కావాలని కోరుకున్న మహనీయుడు కారల్ మార్క్స్ అని, విప్లవ తాత్వికుడు విముక్తి మార్గదర్శకుడు మార్క్స్ అని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకొని పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాస్త్రి నగర్‌లో సీపీఐ(ఎం) కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ యూనియన్ స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా.. పునాది మార్క్సిజమే అని అన్నారు. ఈ విప్లవానికి ముందు వందేళ్ల తర్వాత వందెళ్ళలో ప్రపంచం ఎలా మారింది మారుతున్నది మార్క్స్ సూత్రాలు బట్టి అంచనా వేయొచ్చని అన్నారు. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని కాలం మారింది కాబట్టి విప్లవం కార్మిక వర్గం శ్రమదోపిడి వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పు ఉండదు అని అన్నారు.

అనంతరం సీపీఐ(ఎంఎల్) డివిజన్ కార్యదర్శి దాసు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అన్ని చోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తధ్యమని గతంలోనే ఆంగ్ల పత్రికలు హెచ్చరించినట్టు తెలిపారు. అనేకమంది తత్వ శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని అధ్యయనం చేసిన మార్క్స్ చెప్పింది గతి తార్కిక భౌతిక వాదం ఉన్నది ఉన్నట్లు చెప్పాలని అన్నారు. గతి తార్కిక పద్ధతుల్లో శ్రమ దోపిడీకి గురైన కార్మిక వర్గాన్ని పోరాట రూపంగా మలిచి పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించి మొదటిసారిగా పారీస్లో సోషలిస్టు విప్లవాన్ని సాధించారని అన్నారు.

దేశంలో బిజెపి పాలకవర్గాలు దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు దేశ సంపదను అప్పనంగా దోసి పెడుతున్నారు. తప్ప కార్మికుల శ్రమను దోచుకోవడానికి చట్టాలను మార్చి కార్మికుల నడ్డి విరిచి పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చి పెడుతున్నారని అన్నారు. బానిస సంకెళ్ల నుండి కార్మికుల శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతం చేసి మార్క్స్ స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఉద్యమాలను చేపడతామని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం పాట పాడి ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య, దండుగల సాయిలు, నవీద్, భామండ్ల రవి, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ట్రాఫిక్ ఏసిపి


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏసిపి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ 1వ టౌన్ పోలీస్ స్టేషన్, మార్కెట్ కి వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చడానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా మోక్ష్ డ్రెస్సెస్ వారి సహకారంతో ట్రాఫిక్ పోలీసు వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి నారాయణ మాట్లాడుతూ.. ఈ మార్గంలో నిత్యం ప్రజలు రాకపోకలు జరుగుతాయని, చలివేంద్రం ఉండడం వల్ల ప్రజల దాహార్తితీర్చవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మోక్ష్ డ్రెస్ ప్రవీణ్, ట్రాఫిక్ సిబ్బంది, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో వైభవంగా వసంతోత్సవం



నవతెలంగాణ-మోపాల్

హెూళి పౌర్ణమి సందర్భంగా ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగపల్లి లో శుక్రవారం వసంతోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. మొదట స్వామి వారికి నవ కలశ పూర్ణాభిషేకం నిర్వహించి అనంతరం ఆలయ గోశాలలో జన్మించిన దూడకు రంగులు పూసి వసంతోత్సవాన్ని మొదలుపెట్టారు. గోగు పూలతో తయారు చేసిన రంగులను ఒకరి పై ఒకరు చల్లుకొని ఆనందంగా హెూళి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి గారితో పాటు ఆలయ అర్చక స్వాములు రోహిత్ కుమారాచార్య, శ్రీధరాచార్య, విజయ్ స్వామి పాల్గొన్నారు. వీరితో పాటు నరాల సుధాకర్, నర్సారెడ్డి, శ్రీనివాస్, నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్న తల్లిని హత్య చేసిన కూతురు

- వ్యక్తిగత విషయాల్లో అడ్డుగా ఉందని భర్తతో కలిసి హతమార్చిన వైనం
- నిజామాబాద్ నాగారంలో ఘటన
- వివరాలు వెల్లడించిన నార్త్ రూరల్ సీఐ సురేష్


మాట్లాడుతున్న నార్త్ రూరల్ సీఐ సురేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్

భర్తతో కలిసి కన్న తల్లిని హత్య చేసింది ఓ కూతురు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన శుక్రవారం వెలుగు చూసింది. బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన విజయ(60) భర్త, ఒక కొడుకు కొన్నేళ్ల క్రితం చనిపోగా, మరో కొడుకు వేరే చోటు ఉంటున్నాడు. కాగా కూతురు సౌందర్య అల్లుడితో కలిసి విజయ 300 క్వార్టర్స్ లో ఉంటోంది. విజయను తన మొగుడితో కలిసి సౌందర్య గొంతు నులిమి హత్య చేసింది. ఆ తరువాత గుండెపోటు వచ్చి చనిపోయిందని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే విజయ గొంతుపై గాయాలు ఉండడంతో స్థానికులు అనుమానంతో ఐదో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విజయ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విజయ స్థానిక టిఫిన్ సెంటర్లలో పనిచేసేదని, డబ్బుల కోసమే ఆమెను కూతురు, అల్లుడు హత్య చేశారని తెలిసింది. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్త్ రూరల్ సీఐ సురేష్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన వివరాలను సీఐ సురేష్ వెల్లడించారు. 300 క్వార్టర్స్ నాగారంకు చెందిన మృతురాలు విజయలక్ష్మి గత నాలుగు సంవత్సరాలుగా కూతురు ఇంట్లో ఉంటుంది. తల్లి తమ ఇంటి విషయాలలో జోక్యం చేసుకుంటు తమకు ఇబ్బందిగా మారిందని, అన్నింటికీ అడ్డుగా వస్తుందని భావించిన కూతురు, అల్లుడు ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించారు. ఈనెల 12న బుధవారం రాత్రి సమయంలో ఆమె ముఖంపై దిండుతో నొక్కి గొంతు పిసికి మర్డర్ చేశారు. కూతురు సౌందర్య, అల్లుడు రమేష్‌ను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న నార్త్ రూరల్ సీఐ బి.శ్రీనివాసు, టౌన్-5 ఎస్ఐ ఎం.గంగాధర్‌ను నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి అభినందించారు.


వార్షికోత్సవంలో పాల్గొన్న సీరియల్ నటులు, జబర్దస్త్ ఫేమ్ కమెడియన్‌లు

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఘనంగా నలంద పాఠశాల 21వ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి విద్యార్థి గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ అభస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ భువనగిరి పాణి పవన్ శాస్త్రి అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ 21 వార్షికోత్సవ సంబరాలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిఐ వివేకానంద రెడ్డి, ఎంఈఓ పింజా రాజ గంగారాం, జబర్దస్త్ ఫేమ్ యాక్టర్స్ ఇమ్మానుయేల్ నూకరాజు, ప్రత్యూష చామంతి సీరియల్ యాంకర్, వినిత రెడ్డి-జానకి రామయ్య గారి మనవరాలు, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను ప్రేరణగా ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు . నలంద పాఠశాల 21 వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నలంద యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీనివాస కళ్యాణ ప్రదర్శనతో దేవుని పట్ల ఏ విధంగా భక్తి ఉండాలో, ఏకలవ్య ప్రదర్శనతో గురు, శిష్యుల మధ్య సత్సంబంధం ఏ విధంగా ఉండాలో , మగువా- మగువా నాట్య ప్రదర్శనతో స్త్రీల పట్ల ఏ విధంగా నడుచుకోవాలో చేసిన ప్రతి నాట్య ప్రదర్శనలో ఒక చక్కటి మెసేజ్ సమాజానికి ఇచ్చారు. విద్యార్థులు వారి నృత్య ప్రదర్శనతో అందర్నీ ఆకట్టుకున్నారు. వార్షికోత్సవ సంబరాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని ఈ వార్షికోత్సవాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు


సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శన

అవగాహనే ఆయుధం

వినియోగదారుడా మేలుకో..

- నకిలీ వస్తువులతో నష్టపోతే ఫిర్యాదు చేయొచ్చు
- రూ.20లక్షల వరకు జిల్లా ఫోరంలో ఫిర్యాదులకు అవకాశం
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా...

నవతెలంగాణ-ఆర్మూర్





కల్తీ సరుకులు, నాసిరకం వస్తువులు, నాణ్యతలేని పరికరాలు సాంకేతికంగా మనిషి ఎంత ఎదుగుతున్న తమకు అవసరమైన వస్తువుల కొనుగోలులో మాత్రం అడుగడుగునా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. సగటు మధ్యతరగతి వినియోగదారులు తాము పొందిన సేవలు, కొనుగోలు చేసిన వస్తువులలో లోపాలు ఉన్నట్లయితే నష్టపోవడం తప్ప చేసేదేమి లేదని బాధపడేవారు కోకొల్లలు. తమకోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని అవగాహన లేక తరచూ మోసపోతూ మదన పడుతున్న వినియోగదారులు అనునిత్యం తారస పడతారు. వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు, కోర్టులు ఉన్న సంగతి చాలామందికి తెలియని విషయం. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఒక స్థలాన్ని చూసి మరో స్థలాన్ని విక్రయించేవారు ఎక్కువయ్యారు. అంతేకాకుండా ఒకే స్థలాన్ని ఐదుగురికి విక్రయించే రియల్ ఎస్టేట్స్ బ్రోకర్లు పెరిగిపోయారు. నేడు శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ కథనం...

మార్చి 15 ఎందుకంటే....

స్టేట్స్ ఆఫ్ అమెరికా అధ్యక్షునిగా పనిచేసిన జాన్ ఎఫ్ కెనడా 1962 లో చారిత్రక ప్రకటన చేసిన రోజుగా మార్చి 15 గుర్తింపు పొందింది. కెనడా నిర్వచనం ప్రకారం వినియోగదారుడు అంటే మనమందరం ఆర్థిక వ్యవస్థలో అతిపెద్ద ఆర్థిక, వర్గం, రక్షణ, సమాచారం, ఎంపిక విజ్ఞప్తి ఇవి ప్రకటించిన హక్కులు. 1972 లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకులు అన్వర్ ఫజల్ మార్చ్ 15వ తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. దీంతో అప్పటి నుంచి ఈ దినోత్సవం కొనసాగుతోంది.

వినియోగదారుల హక్కులు..

వినియోగదారులు కొన్ని వస్తువులు పొందే సేవల నాణ్యత, ప్రమాణం, ధరల గురించి, సంపూర్ణ సమాచారం పొందవచ్చు. వినియోగదారులు వస్తువులు సేవలు తక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా దీర్ఘకాలం ఎలా ఉండాలి అవి వినియోగదారుల ఆస్తులకు నష్టం కలిగించకూడదు. ఆ భద్రత పొందడానికి కొన్ని వస్తువుల నాణ్య తను నిర్ధారించుకోవాలి. వీలైనంతవరకు ఐఎస్ఐ మార్క్, హాల్ మార్క్ వంటి నాణ్యత గల వస్తు వులను కొనుగోలు చేయాలి. వస్తువులు, సేవలకు సరసమైన ధరల్లో ఉండడం వినియోగదారుల హక్కు. వినియోగదారులు వినియోగదారుల వేదికపై తమ అభిప్రాయాలు వినిపించవచ్చు. అన్యాయమైన వాణిజ్య విధానాలు మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందడం వినియోగదారుల హక్కు.

ఎవరెవరు ఫిర్యాదు చేయొచ్చు..?

వినియోగదారుల ఫోరాన్ని ఎవరెవరు సంప్రదించవచ్చు అంటే ఎరువుల కల్తీ, తూకం తక్కువ, నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులు వీటి బారినపడి నష్టపోతున్న రైతాంగం, విద్యుత్ కోత నెలకోసారి స్లాబ్ మార్చి అధిక చార్జీలు వసూలు చేసే విద్యుత్ శాఖ తీరుతో నష్టపోయేవారు. కొన్ని వస్తువులు నాణ్యత లేకపోయినా, చెడిపోయిన, చౌక ధరల డీలర్లు సకాలంలో సరుకులు పంపిణీ చేయకపోతే, సినిమా థియేటర్లలో సౌకర్యాలు లేకపోయినా, పరిశుభ్రత లేకున్నా వైద్యసేవలో మున్సిపాలిటీలో లోపాలున్న మినరల్ వాటర్ పేరుతో సాధారణ వాటర్ అమ్ముతూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న కల్తీ పాలు అమ్ముతున్న వినియోగదా రుల ఫోరాన్ని సంప్రదించవచ్చు..

ఫిర్యాదులలో పేర్కొనవలసినవి....

ఫిర్యాదుదారుని పూర్తి పేరు చిరునామా పేర్కొనాలి. అవతలి పార్టీ పూర్తి పేరు చిరునామా ఫిర్యాదు చేయడానికి గల కారణాలు ఎప్పుడు ఏ విధం గా నష్టం జరిగిందో పేర్కొనాలి. దానికి సంబం ధించి న డాక్యుమెంట్లు రసీదు, ఇతర వివరాలు జతచే స్తూ 20 లక్షల వరకు జిల్లా ఫోరంలో, 20 లక్షలకు మించి కోటి వరకు రాష్ట్ర కమిషన్‌లో ఫిర్యాదు చేయవ లసి ఉంటది. కొనుగోలు చేసిన లేదా నష్టం జరిగిన నాటి నుంచి రెండేళ్లలోపు ఫిర్యాదు చేయవచ్చు. ఆలసా ్యనికి తగిన కారణాలు చూపుతూ రెండేళ్లు దాటిన తర్వాత ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుంది.

జిల్లాలో....

వినియోగదారులకు న్యాయం చేయడానికి డిసెంబర్ 24, 1986లో పార్లమెంటులో వినియోగదారుల హక్కుల చట్టాలు తీసుకొచ్చారు. అనంతరం జిల్లాల్లో వినియోగదారుల పోరాన్ని 1987లో ఏర్పాటు చేయగా ,పూర్తిస్థాయి ఫోరం మాత్రం 1993 లో ప్రారంభమైంది. మోసపోయామ ని భావించే వినియోగదారులు తాము కొనుగోలు చేసిన సేవలు, బిల్లులను తీసుకొని జిల్లా ఫోరంలో సంప్రదిస్తే సంబంధిత వినియోగదారులకు పూర్తి న్యాయ సహాయ సహకారాలు అందిస్తారు. వినియోగదారుడు తమకు జరిగిన నష్టాన్ని ఫోరం దష్టికి తీసుకెళ్లొచ్చు. జిల్లా వినియోగదారుల కమిషన్ కోర్టులో ప్రస్తుతం

167 కేసులు పెండింగ్

నీటి వ్యాపారంలో దోపిడీ...

ఉమ్మడి జిల్లాలతో పాటు, పలు డివిజన్ కేంద్రాల్లోనూ ఐఎస్ఐ ముద్ర లేకుండా నీటి వ్యాపారం జరుగుతోంది. ఎండలు ముదురుతున్న వేళ తాగునీటి అవసరాలు పెరుగుతాయి. వినియోగదారులను మోసం చేస్తున్న వాటర్ ప్లాంట్ల పైన సంబంధిత శాఖ అధికారులు దాడులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా నీటి వ్యాపారం చేస్తూ ప్రజలను దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్విరామ సేవలు చేస్తూ....

పట్టణానికి చెందిన తిరునగరి సింహయ్య జిరాయితినగర్ వెళ్లే దారిలో గల మాధవి విద్యాలయం పాఠశాల ద్వారా ఎందరో చిన్నారులను విద్యావంతు ల్ని చేస్తూ, వినియోగదారుల ఫోరం ద్వారా నిర్విరామ సేవలు చేస్తున్నారు. జిల్లా వినియోగదారుల సమైక్య ఉపాధ్యక్షులుగా, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షునిగా పనిచేస్తూ పాఠశాల విద్యార్థులతో అవగా హన ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మండల వినియోగదారుల సంఘం కరపత్రాలను ఆర్డీవో రాజాగౌడ్ చేతుల మీదు గా ఇటీవల ఆవిష్కరించారు.. ఈ కరపత్రాల్లో విని యోగదా రుల హక్కులను పూర్తిగా వివరించినట్టు తెలిపారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల ఫోరం సభ్యులు (ఫైల్)

చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం

పొడపల్లి అనిల్, వినియోగదారుల మండలి డివిజన్ అధ్యక్షులు, ఆర్మూర్



నగదు చెల్లించి వస్తువులు సేవలను ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ వినియోగదా రులే. ఆహార కల్తీ మహమ్మా రిపై చైతన్యవంతుల్ని చేసేలా వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నాం.

కస్టోడియల్ డెత్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

గురువారం అర్ధరాత్రి జరిగిన సంపత్ కస్టోడియల్ డెత్‌పై సమగ్రంగా సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపి చట్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో గల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకీ శు క్రవారం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెళ్లి కుటు ంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లా డారు. విచారణ పేరుతో పోలీసులు తీవ్రంగా కొట్టడం వల్లనే సంపత్ అనే వ్యక్తి చనిపోవడం జరిగిందని, ఒకవేళ అతను ఏదైనా నేరం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప తీవ్రంగా కొట్టడం సరైనది కాదని అన్నారు. ఘటనకు సంబంధించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతునికి నలుగురు చిన్న పిల్లలు ఉన్నారరని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అనారు. కస్టోడియల్ డెత్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జి.రమేష్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, న్యూడెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలి :

బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో మృతికి కారణమైన పోలీసులపై హత్యా నేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ వడ్డెర జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విలేకరులతో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ మాట్లాడుతూ..రెండ రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ గల్ఫ్ దేశాలకు మ్యాన్ పవర్ సప్లై లైసెన్స్‌తో కొంత మంది వ్యక్తులకు గల్ఫ్ దేశాలకు పంపారని అన్నారు. వారికి గల్ఫ్ లో సరైన ఉపాధి అవకాశాలు కల్పించలేదని సంపత్ పై నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే సంపత్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. మళ్లీ పోలీసులు కోర్టు ద్వారా కస్టడీకి తీసుకోని తీవ్రంగా మానసిక, భౌతికంగా హింసిం చడం వల్లే మృతి చెందారని బంధువులు చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులను డిస్మిస్ చేసి హత్యానేరం కేసు నమోదుచేసి దర్యాప్తు చేయా లని డిమాండ్ చేశారు. సంపత్ కుటుంబ సభ్యులకు యాబై లక్షల రూపాయల ఆర్థిక సహా యాన్ని అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో తెలంగాణ వడ్డెర యువజన సంఘం రాష్ట్ర నాయకులు సాయి కుమార్, మృతుడి ఇద్దరు భార్యలు, తల్లి పెద్దపల్లి జిల్లా వడ్డెర సంఘం నాయకులు శంకర్ రాజు, పరుశురాం, కుల పెద్దలు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవ తరగతి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. శు క్రవారం నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో గల సామాజిక రచయితల సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావస్తున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఏ పరీక్ష కేంద్రంలోనూ మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని, విద్యార్థులకు మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం తో పాటు ప్రతిపరిక్ష కేంద్రంలో ఏఎన్ఎమ్‌లను ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. మంచి గాలి వెలుతురున్న గదుల్లోనే పరీక్షలు నిర్వహించేలా చూడాలని చీకటిగా ఉండే గదులలో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వేముల శేఖర్, రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం

- జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ అప్రజాస్వామికం
- కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించి, నిలదీసే గొంతుల్ని నొక్కే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వా మికమని పేర్కొన్నారు. శాసనసభ సమావేశాలు ముగిసే వరకు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపుమేరకు కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండల కేంద్రాల్లో ఆ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ .. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ తీరును ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రశ్నిస్తున్న గొంతుకలను సస్పెండ్ చేస్తుందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, అమలు ఎలా చేయాలో అర్థం కాక సమస్యలను పక్కదోవ పట్టించడానికి ప్రభుత్వం సస్పెన్షన్ డ్రామాకు తెరలేపిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు, అనని మాటల్ని అన్నట్టుగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం, అబద్దాలను ప్రచారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడానికి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. లేదంటే త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్ పల్లిలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, చౌట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలావత్ ప్రకాష్, మాజీ సర్పంచ్ దయ్య దేవయ్య, వేల్పూర్ లో మండల ఉపాధ్యక్షులు రేగుళ్ళ రాములు, జిల్లా మహిళా నాయకురాలు నిరడి భాగ్య, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ పిట్ల సత్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

మార్కండేయ మందిర నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ శ్రీ మార్కండేయ మందిర నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ.25,116 విరాళంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మండలాధ్యక్షుడు తూర్పు రాజులు పద్మశాలి సంఘం సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ద్వారా ప్రభుత్వం నుంచి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హోలీ పండుగపై పోలీసుల నిఘా

నవతెలంగాణ-మద్నూర్

హెూలీ పండుగ సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలో పోలీసుల నిఘాను శుక్రవారం కట్టుదిట్టం చేశారు. హెూలీ సంబరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా ఎస్సై విజయ్‌కొండ మండల కేంద్రంలో పోలీస్ నిఘా కట్టుదిట్టం చేశారు. శుక్రవారం కావడంతో పాటు హెూలీ పండుగ అటు రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతున్న సందర్భంగా హెూలీ పండుగ ప్రశాంత వాతావరణంలో జరగడానికి పోలీస్ శాఖ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది.


పోలీసుల బందోబస్తు

17న కామారెడ్డికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాక

- ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు భారీగా తరలిరావాలి
- రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్ రాములు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా మున్సిపల్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మన వాటా కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి సోమవారం రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి వస్తున్నందున జిల్లాలోని ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తుగా కామారెడ్డికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు వెంకటరాములు కోరారు. ఆయన మాట్లాడుతూ.. మన వాటా కోసం మనమెంతో మనకంత వాటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్ష ప్రతి జిల్లాలో జరుగుతున్నదని, ఈ నేపథ్యంలో సోమవారం కామారెడ్డికి భారీ ఎత్తున తరలిరావాలని ఆయన తెలిపారు.

వరి పంటలు పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామ శివారులోని పెద్దవాగు సమీపంలో నాటిన వరి పంట ఎండుముఖం పట్టిందని గ్రామస్తులు తెలపడంతో నీటిపారుదల శాఖ ఏఈ భూజేందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. గ్రామంలోని పెద్ద వాగు ఆధారంగా వేసిన రైతుల పంట పొలాలకు నీరు అందక ఎండు ముఖం పట్టిందని వారు పేర్కొన్నారు. ఆ పంటలు రక్షించడానికి ఎలాంటి ఆధారం లేకపోవడంతో చుట్టుపక్కల ఉన్న బోరు బావుల వారి వద్ద నుంచి నీటిని తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వాగును ఆధారం చేసుకుని నాటిన వరి పంటలు మాత్రమే ఇలా ఉన్నాయని, మిగతా కుంటల కింద ఉన్న పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. వీరి వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయిలు, రైతులు యోగేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు కుస్తీ పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కొండాపూర్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి జైలొసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం హెూలీ పండుగ అనంతరం మరుసటి రోజు కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మధ్యాహ్నా మూడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పిసి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. టెంకాయ నుంచి మొదలుకొని రెండుతులాల వెండి కడియం వరకు విజేతలకు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన యోధులు కుస్తీ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎండుతున్న పంటలను పరిశీలించిన బీజేపీ నాయకులు


పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలో డీ-40 కాలువ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంట పొలాలను శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. అమ్దాపూర్, ఊట్‌పల్లి శివారులో ఎండిపోతున్న పంట పొలాలను నాయకులు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీ-40 కెనాల్‌కు నిజాంసాగర్ నీటిని తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేసి దాదాపుగా 12 రోజులైందని, దాంతో ఈ12 రోజులలో ఎండలకు పంట పొలాలు పూర్తిగా ఎండిపోయి ఉన్నాయన్నారు. నిండు పొట్ట దశలో ఉన్న వరి పంట 100శాతం పెట్టుబడి అయిపోయాక ఈ విధంగా ఎండి పోవడం చాలా దారుణమని వాపోయారు. పంటలకు నీరు పూర్తిగా అందితే దిగుబడి ఎక్కువగా వస్తుందని దాంతో రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం సాగునీరు సరిగా అందించడం లేదని ఏద్దేవా చేశారు. రైతులు నీరు అందక బోర్లు ఉన్న రైతుల దగ్గర ఒక్కొక్క తడికి 5000, 6000 రూపాయలు చెల్లించి సాగునీరు పొందవలసిన వస్తుందన్నారు. ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తే హెూలీ పండగ ఉందని హెూలీ తర్వాత వదులుతామని చెప్పున్నారని వాపోయారు. ఇక నుండైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కంటిన్యూగా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో గురువారం స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అందుకు స్పీకర్ మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని అమానుషంగా ఈ బడ్జెట్ సమావేశాలు అయ్యేవరకు సస్పెండ్ చేసినందుకు నిరసనగా శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ మాట్లాడుతూ.. సిఎం రేవంత్‌రెడ్డి కక్షపూరితంగా పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా గురువారం నిర్వహించిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతుండగా అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు అడుగడుగునా అడ్డుకోవడంతో జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. 'సభ మీ ఒక్కరిది కాదు అన్నాడని.' ఆయనను స్పీకర్ ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు ప్రకటించారని ఆయన తెలిపారు. ఇందుకు స్పీకర్‌ను అవమానించినట్లు ఉందని అధికార కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష నిర్ణయంతో కుట్రపన్ని సస్పెండ్ చేశారని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, ఎల్లారెడ్డి టౌన్ అధ్యక్షుడు ఆదిములం సతీష్, సొసైటీ అధ్యక్షులు ఎగుల నర్సింలు, డి.సి.సి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎ.ఎం.సి డైరెక్టర్ విఠల్, మాజీ కౌన్సిలర్లు ఎరుకల సాయిలు, శ్రవణ్ కుమార్, ఇమ్రాన్, సొసైటీ డైరెక్టర్ దేవదాస్, బరకత్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, నాగం రాజయ్య, అరవింద్‌గౌడ్, బబ్లూ, దయాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒంటి చేత్తో ఓడించాడు

- దూపల్లిలో ఘనంగా కుస్తీ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో గురువారం జరిగిన కుస్తీ పోటీలలో కర్యేలి గ్రామానికి చెందిన గణేష్ అనే మల్లయోధుడు కుస్తీ పోటీల్లో పాల్గొన్నాడు. తన ఒంటి చేత్తో పోరాడి గెలిచాడు. అలాగే మరో మల్లయోధుడు ఒంటికాలితో పోరాడి ఓడాడు. ఒంటి చేత్తో, ఒంటి కాలితో మల్ల యోధుడిని చూసిన ప్రజలు వారికి నీరాజనాలు పట్టారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గణేష్ అనే మల్లయోధుడికి రూ.2100 నగదు బహుమతిని అందజేశారు. ప్రతి సంవత్సరం ఒంటి చేతితో ఈ మల్ల యోధుడు కుస్తీపోటీల్లో పాల్గొంటున్నాడు. ప్రతీసారి ఓటమి ఎరుగకుండా గెలుస్తాడని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాబన్న, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న యాదవ్, డైరెక్టర్ చిట్టి, సోనాల గంగాధర్, పోశెట్టి, రవి తదితరులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

3వ రోజు ఎమ్మార్పీఎస్ దీక్షలు

నవతెలంగాణ-బోధన్/రెంజల్

వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని సాలూర మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారం 3వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ.. మాట మీద నిలబడని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి అనార్హులని అన్నారు. అబద్ధాలు చెప్పడంలో, చెప్పి నమ్మించటంలో దిట్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి దిలీప్ మాదిగ, గుండారి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ :ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలను చేపట్టవద్దని కోరుతూ చేస్తున్న నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో మాదిగ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరాహార దీక్షలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇలాగే మాదిగలపై అక్రమ అరెస్టులను చేస్తే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, మండల అధ్యక్షులు కిన్నెర మోహన్, మండల ప్రధాన కార్యదర్శి లసిమిగారి నరేష్, రవి, ప్రసాద్, ప్రభాకర్, శ్యామ్, రవితేజ, బి.పర్వయ్య, పోశెట్టి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


రెంజల్: దీక్షలో పాలొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు


బోధన్‌లో..

ప్రత్యేక ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ చేపట్టాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

సుప్రీంకోర్టు తీర్పు మేరకు దివ్యంగా విద్యార్థులకు బోధన అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయాలని కామారెడ్డి జిల్లా ప్రత్యేక ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షులు గైనీ చిన్నసాయిలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 లెక్కల ప్రకారం 81000 మంది దివ్యాంగ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో నమోదు అయి ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ నందు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయులైన ఐఈఆర్‌పీలు 790 మంది గత 19 సంవత్సరాలుగా విద్యాబోధన అందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు. సుప్రీంకోర్టు ఈ నెల 7న ఇచ్చిన తీర్పు ప్రకారం భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన అందిస్తున్న కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న రోజువారీ వేతనం కింద పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను వారి సర్వీసును పరిగణలోకి తీసుకొని వారికి పే స్కేల్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును వెలువరించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నందు ప్రస్తుతం 790 మంది ప్రత్యేక ఉపాధ్యాయులైన ఐఈఆర్‌పీలు గత 19 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన బోధన అందిస్తున్నామని ఈ సంద ర్భంగా ఆయన తెలి పాడు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మహారాష్ట్ర నందు 3100 మందిని, మణిపూర్ రాష్ట్రంలో 272 మందిని, హర్యానా రాష్ట్రంలో 146 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేసినట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక ఉపాధ్యాయులకు వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



బాలవికాస్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా కట్

నవతెలంగాణ-జుక్కల్

బాల వికాస్ ఫిల్టర్ వాటర్ ప్లాంట్ విద్యుత్ సరఫరాను విద్యుత్ అధికారులు నిలిపివేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పడంపల్లి గ్రామంలో లక్షల రూపాయలు వెచ్చించి బాలవికాస్ వాటర్ ప్లాంట్‌ను 20.11.2018న నిర్మించి ప్రారంభించారు. గత ఏడు సంవత్సరాలుగా నిర్విరామంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో బాలవికాస్ వాటర్ ప్లాంట్‌ను కొనసాగిన్నున్నారు. ప్రస్తుతం విద్యుత్తు బకాయి లు పేరుకుపోవడంతో విద్యుత్ అధికారులు గత రెండు రోజుల క్రితం వాటర్ ప్లాంట్‌కు చెందిన విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటే గ్రామస్తుల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో ప్లాంటును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో నీటి సమస్య తలెత్తుతోంది. ఫిల్టర్ వాటర్ లేక గ్రామంలోని ప్రతి ఇంటి కుటుంబం తాగునీరు సమస్యను ఎదుర్కొంటున్నారు. బాల వికాస్ నిర్వహణ సక్రమంగా లేకనే సమస్య జటిలమైందని గ్రామస్తులు అంటున్నారు. తాగునీరు లేక పక్క గ్రామమైన పెద్దఎడ్గి, నాగల్‌గావ్ నుండి ద్విచక్ర వాహనాలపై నీరును డబ్బాలలో తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బాలవికాస్ నిర్వాహకులు విద్యుత్ బకాయిలు చెల్లించి తగు చర్యలు తీసుకొని తాగునీటిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.



సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-లింగంపేట్

సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని జయంతి ఉత్సవాలను విజయ వంతం చేయాలని బంజారా సేవా సంఘం జిల్లా ఇన్చార్జి సురేందర్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజవర్గం 8 మండలాలకు సంబంధించిన లింగంపేట్ మండల కేంద్రంలో మంగళవారం జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బంజారా సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ.. 8 మండలాల ప్రతి మండలం తండాల నుంచి భారీ ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు. లింగంపేట్ మండల బంజారా కమిటీ జగదాంబ మాత సేవలాల్ మహారాజ్ పూజ, భోగ్ కార్యక్రమం, భక్తులకు అక్కడే భిక్ష ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. భోగ్ కార్యక్రమం అయిన తర్వాత సేవాలాల్ మహారాజ్ రథంతో జిఎస్ఆర్ గార్డెన్ వరకు ర్యాలీ, అక్కడ ముగింపు సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారా జిల్లా ఇన్చార్జి సురేందర్ నాయక్, లింగంపేట్ మండలాధ్యక్షుడు గనునాయక్, లింబీస్ నాయక్, వచ్చానాయక్, తాజా సర్పంచ్ పరశురాం, వినోద్ నాయక్, ప్రకాష్ నాయక్, దశరథ్ నాయక్, ఫులొసింగ్ నాయక్, మోతిరాం, శంకర్ మండల నాయకులు పాల్గొన్నారు.



శబరిమాత ఆశ్రమంలో 25వ రజతోత్సవ వార్షికోత్సవం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరీమాత ఆశ్రమంలో ఏప్రిల్ 5, 6, తేదీల్లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 25వ రజతోత్సవ వార్షికోత్సవం జరపనున్నట్లు రుద్ర సహిత నవ చండి యాగం శ్రీరామ మహా యజ్ఞం దీపోత్సవం లక్ష పుష్పార్చన సంకీర్తన ప్రారంభోత్సవం జరుగుతుందని ఉత్సవాలకు భక్తులు హాజరుకావాలని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

సాగునీటి కోసం కాలువకు మరమ్మతులు


జెసిబితో మరమ్మతులు పనులు చేయిస్తున్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా క్యాంపు గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో జెసిబి సహాయంతో కాలువకు మరమ్మతులు చేయించి సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకున్నామని రైతులు తెలిపారు. కింది ఆయకట్టు వరకు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆరోగ్య రాజు, బెల్లంకొండ ప్రాంచేస్, కిసాన్ సేల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్ని లారీ

- ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ వద్ద శుక్రవారం లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. శుక్రవారం ఉదయం సమయంలో కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్లోని పెట్రోల్ బంకు వద్ద ఆటో కామారెడ్డి నుంచి సదాశివనగర్ వైపు వెళ్తుండగా.. వెనకాల నుంచి తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ తన వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణి స్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ను పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ధ్వంసమైన ఆటో

ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకూ నియామకాలు చేపట్టొద్దు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సాయన్న


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగ నియమకాలు చేపట్టొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న అన్నారు. గురువారం తాడ్వాయిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాలల ఒత్తిడికి తలొగ్గి గ్రూప్ వన్, గ్రూప్ 2, ఫలితాలు విడుదల చేయటం సమంజసం కాదని అన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బట్ట వెంకట రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్యాగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా
- జయప్రదం చేయండి : అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు వి.సురేష్ పిలుపు

నవతెలంగాణ-జుక్కల్

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.సురేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ ముందు 48 గంటల ధర్నా, అలాగే వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కామారెడ్డి జిల్లాలోని అంగన్వాడీ టీచర్స్, మినీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ప్రతి ఒక్కరూ అంగన్వాడీ సెంటర్స్ మొత్తం బంద్‌చేసి మహాధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్క టీచర్ పాల్గొనాలని తెలిపారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కోమట్పల్లి, మోతే, బానాపూర్, భయంపల్లి, భవానీపేట్, మంబోజిపేట్ గ్రామాలకు చెందిన 23 మంది లబ్దిదారులకు రూ.2,302,668 గల కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యం లేకుండా నేరుగా లబ్దిదారుల ఇంటికి వెళ్లి అందిస్తున్నామన్నారు. పేదింటి వారికి కలలు నిజం చేయడానికి కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సాయిలు, లింగంపేట్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, యూత్ మండలాధ్యక్షులు రాజు, కిరణ్, శంకర్‌రావు, రమేష్, గోపాలరావు పాల్గొన్నారు.

నేటి నుంచే ఒంటిపూట బడులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా పాఠశాలకు నేటి శనివారం నుంచి ఒంటి పూట బడులు ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగుతాయని, పదవ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులను సమయానికి పాఠశాలకు పంపేందుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ- ఆర్మూర్



పట్టణంలోని నలంద హై స్కూల్ 21 వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి అత్యంత సంబురంగా నిర్వహించగా, ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నలంద యజమాన్యం ప్రసాద్, సాగర్‌ను పూలమాల, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కాంతి గంగారెడ్డి, మానస గణేష్, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, విద్య ప్రవీణ్ పవర్, స్కాలర్స్ వేణు తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి ఐఏఎస్ అధికారిణి భవానిశ్రీ శుక్రవారం నిజామాబాద్ కు మొట్టమొదటి సారిగా అధికారిక పర్యటనకు వచ్చిన సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్, అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ పసుపు రైతుల చిరకాల కోరిక రైతుల ఆకాంక్షకు అనుగుణంగా జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, పసుపునకు కనీస మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సెక్రటరీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రావు, ఈవియల్ నారాయణ, ఎస్.ప్రసాదరావు, లక్ష్మీనారాయణ లావు వీరయ్య, డి చక్రపాణి హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ (హైదరాబాద్) తదితరులు ఉన్నారు.

ఆనందాల హోలీ


ఆర్మూర్‌లో డీకేఆర్ కుటుంబీకుల వేడుకలు


నిజామాబాద్‌సిటీ : హోలీ ఆడుతున్న ఎమ్మెల్యే

- నృత్యాలు చేస్తూ సంబరాల్లో మునిగిన చిన్నా పెద్ద

నవతెలంగాణ-విలేకరులబృందం

నిజామాబాద్ సిటీ: హెూలీ పండుగ సందర్భంగా నిజామాబాద్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ శాఖ వారు ఎటువంటి అవాంతరాలు జరగకుండా, ఇబ్బందులు కలగకుండా ఎటువంటి గొడవలు జరగకుండా హెూలీ సందర్భంగా అన్ని ప్రాధాన కూడలీల వద్ద పోలీసులు ప్రత్యేకంగా విధులు నిర్వహించారు. నగరంలో ప్రధాన రహదారులు నిర్మాణుష్యంగా మారాయి.

హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు గులాల్ చల్లుకుంటూ ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా హెూలీ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర జిల్లా ప్రజలకు కార్మికులకు అధికారులకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయన్న, రవి, సాయి నిఖిల్,నాగరాజు, బబ్లు, రాజు, గంగాధర్, సమీర్, యాదవ్, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలో శుక్రవారం రంగుల పండుగ హెూలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో ఉదయం నుండి చిన్నారులు, యువకులు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ రంగుల్లో మునిగితేలారు. యువకులందరూ ఒకరిపై ఒకరు రంగులు పోసుకుంటూ, కులమతాలకతీతంగా అంగరంగ వైభవంగా హెూలీ పండుగ సంబరాలు చేసుకున్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు హెూలీ వేడుకలు నిర్వహించారు. నాయకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఈ వేడుకల్లో మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగుల్లో మునిగితేలారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై అనిల్ రెడ్డికి హెూలీ శుభాకాంక్షలు తెలిపి, రంగులు పూశారు. మండల కేంద్రంలో యువకులు సంతోషంతో నృత్యాలు చేస్తూ హెూలీ సంబరాలు చేసుకున్నారు.

కంఠేశ్వర్: నిజామాబాద్ జిల్లా కేంద్రం లో వినాయక నగర న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో తెలంగాణ అమరవీరుల పార్క్‌లో వాకర్స్ ఆధ్వర్యంలో న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ అధ్యక్షులు డి.నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బాల్ సింగ్, ఉపాధ్యక్షులు కంచెటి లక్ష్మణ్, యస్.సిద్దిరాములు, సహాయ కార్యదర్శి-కమలాకర్ రెడ్డి, కోశాధికారిహన్మంతరావు, శ్రీనివాస్, వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, శివ లాల్, చిన్నరెడ్డి, శివశ్రీనివాస్, యస్, సిద్దిరాములు, కే,వెంకటేష్, పురుషోత్తం, డాక్టర్ ప్రవీణ్, శ్రీనివాస్, రాజు తదితరులు కాలనీ పెద్దలు, పిల్లలు ఆనందంతో హెూలీ సంబరాలు జరుపుకున్నారు.

హెూలీ సంబరాల్లో పాల్గొన్న నుడా చైర్మన్

నిజామాబాద్ నుడా చైర్మన్ కేశవేణు హెూలీ సంబరాల్లో పాల్గొని రంగులు పూసుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రజలందరికీ హెూలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. సహజమైన రంగులు చల్లుకొని పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తన స్నేహితులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని తనకుర్తి గ్రామంలో హెూలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనంత్ రెడ్డి, సూర్య రెడ్డి, జలంధర్ రెడ్డి, చందూర్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణానికి చెందిన డీకే ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత, ఎస్ఎస్‌కే క్షత్రియ సమాజ్ నాయకులు డీకే రాజేష్ కుటుంబ సభ్యులు హెూలీ సంబరాలు నిర్వహించుకున్నారు .

బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ...

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హెూలీ సంబరాల్లో సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, రైతు నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి పట్టణ అధ్యక్షులు మందుల బాలుకు కార్యకర్తలు రంగులు పూసి హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్, ఎంజె రమేష్, పెంటయ్య, గుగులోత్ తిరుపతి నాయక్, ఉదయ్ గౌడ్, కుమార్, ప్రసన్న గౌడ్, జనగాం బాలు, మనీ, అల్జాపూర్ రాజేష్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

పట్టణంలోని జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో.....

పట్టణంలోని జిజి ఫౌండేషన్ అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల కిషన్ డీజే దయానంద్, స్వాతి సురేష్, బెల్దారి శ్రీనివాస్, గుండు శ్రీనివాస్, మిత్రులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి, రెంజర్ల, వెంచిర్యాల, నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతి, యువకులు, ఆయా పార్టీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పెద్దలు, మహిళలు, పిల్లలు సహజ సిద్ధమైన రంగులు చల్లుకుంటు సంతోషంలో మునిగిపోయారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, టీజీ యండీసీ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్, యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాలా మోహన్ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిలు, మాజీ ప్రజాప్రతినిధులు బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు..

ఆర్మూర్ : పట్టణంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఘనంగా హెూలీ సంబరాలు నిర్వహించారు. ఆర్మూర్ లోని మార్కెట్ యార్డ్ లో జర్నలిస్టులు ఒకరినొకరు రంగులు పూసుకుని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలో ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, పీసీసీ మాజీ కార్యదర్శి, న్యాయవాది ఖాందేశ్ శ్రీనివాస్, సీఐ సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్, మాజీ కౌన్సిలర్ రవి గౌడ్, లింబాద్రి గౌడ్, గంగా మోహన్ చక్రులకు రంగులు పూసి హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సాత్ పుతె శ్రీనివాస్, గణేష్ గౌడ్, విన్సెంట్, శ్రావణ్, మహిపాల్, వినోద్, చరణ్ గౌడ్, షికారి శ్రీనివాస్, గట్టడి అశోక్, ఘటడి రాజ్ కుమార్, జంగం శ్రీనివాస్, సామ సురేష్, గటడి అరుణ్, విట్టల్, సాయి, బారడ్ గణేష్, వెంకటేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలో ఘనంగా హెూలీ సంబరాలు జరిగాయి.పురుషులు, మహిళలు అని తేడాలు లేకుండా పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు, పిల్లలు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడం ప్రశ్నించే గొంతుని నొక్కడం సరికాదని పూజ నరేందర్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సూక్కి సుధాకర్, మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి, సీనియర్ నాయకులు నచ్చు చిన్నరెడ్డి, అల్లూరు గంగారెడ్డి, ఇందూర్ విజయ్, శేఖర్, మోహన్, మైనార్టీ నాయకులు హర్షద్, శైఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న బాలయ్య

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని ఎస్సీ మాదిగ సంఘ కమ్యూనిటీ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మండల కిసాన్ ఖేత్ అధ్యక్షుడు బాలయ్య శుక్రవారం భూమిపూజ చేశారు.రూరల్ ఎమ్మెల్యే మాదిగ సంఘం కమ్యూనిటీ కాంపౌండ్ వాల్ (గోడ) గురించి 3లక్షలు శాంక్షన్ చేశారని బాలయ్య తెలిపారు. సిడిపి నిధుల ద్వారా 3లక్షల రూపాయలు మంజూరైనట్టు అర్బన్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేయించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు మాదిగ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కూడాల గంగారాం, కిషన్ కేత్ మండల అధ్యక్షుడు గుండ్ల బాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లూరి సామెల్ల లింబరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంట సురేందర్, నాయకుడు ఆర్మూర్ గంగన్న, మాదిగ సంఘం కుల పెద్ద మనుషులు పాల్గొన్నారు

సావెల్‌లో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన మేక

నవతెలంగాణ-మెండోరా



విద్యుత్ షాక్ తో మేక మృతి చెందిన ఘటన శుక్రవారం సావెల్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సావెల్ గ్రామానికి చెందిన పుట్టి.దేవేందర్‌కు చెందిన మేకలు గ్రామ పొలిమేరలో మేపుతూ ఉండగా ట్రాన్స్‌ఫారం వద్ద మేకకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన మేక విలువ దాదాపు 7 రూపాయలు ఉంటుంది.

బెదిరిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల గద్దెలు ఎత్తుగా లేకపోవడం చుట్టూర రక్షణకు కంచె లేకపోవడంతో నే మేకలు మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇంతకుముందు కూడ పలుమార్లు జరిగి విద్యుత్ షాక్ తగిలి మేకలు మృత్యువాత పడ్డాయని వాపోతున్నారు. ఈ విషయం విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో చేయించడం మాకేం అవసరం అని బెదిరింపులకు గురిచేసినట్లు ఆరోపిస్తున్నారు. విద్యుత్ ఉన్నత అధికారులు , ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం

- గ్రూప్-2 స్టేట్ 6వ ర్యాంకర్ ఎర్ర అఖిల్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని దోంచంద గ్రామానికి చెందిన ఎర్ర అఖిల్ టీజీపీఎస్సి విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో స్టేట్ 6వ ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అఖిల్‌ను అభినందనలతో ముంచెత్తారు. అఖిల్ ది వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ, ఆయన తండ్రి ఎర్ర రాజేందర్‌కు విద్యపై ఉన్న మక్కువతో ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో స్థిరపడి పోయారు. తల్లి విజయ లక్ష్మి గృహిణి అయినప్పటి అఖిల్‌ను వెన్నంటే ఉండి ప్రోత్సాహం అందించింది. వివరాల్లోకి వెళితే అఖిల్ తన పదవ తరగతి విద్యను హైదరాబాద్ లోని నీరజ్ పబ్లిక్ స్కూల్‌లో, ఇంటర్ నారాయణ కాలేజీలో, ఇంజనీరింగ్ వాసవి కాలేజీలో పూర్తి చేశాడు. చిన్ననాటి నుండే అఖిల్ చదవులో చురుకుగా ఉండేవాడిని, ఆయనకు సేవాభావం ఎక్కువ అని తండ్రి రాజేందర్ తెలిపారు. అఖిల్ కాలేజీ చదువుకునే రోజుల్లోనే పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధించడం, కెరీర్ గైడ్ లెన్స్ ఇవ్వడం కూడా చేశాడని, చారిటీలో భాగంగా దుస్తులను సేకరించి పేద పిల్లలకు అందివ్వడం చేసేవాడని అన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే సమయంలో కచ్చితంగా 10 గంటలకు మించకుండా చదువుకునే వాడని తెలిపారు. దీనిలో భాగంగానే అఖిల్ 2024లో గ్రూప్-4 పరీక్ష రాసి అలవోకగా స్టేట్ 14 వ ర్యాంక్ సాధించాడని, ప్రస్తుతం హైదరాబాద్‌లోని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడని తెలిపారు. ప్రభుత్వ కొలువు సాధించినప్పటికి ఇంకా ఉన్నతంగా ఎదగాలి అనుకోని గ్రూప్ 2 పరీక్షలు రాయడంతో స్టేట్‌లోనే ఓపెన్ కేటగిరీలో 6 వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని, తల్లిదండ్రులుగా మాకు ఇంతకంటే గొప్ప విషయం మరేం ఉంటుందని అన్నారు.


అఖిల్‌కు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

గ్రూప్-3లో ఎర్ర అఖిల్‌కు 31వ ర్యాంక్

ఏర్గట్ల మండలానికి చెందిన ఎర్ర అఖిల్‌కు శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 31వ ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. సుమారు 3 లక్షల మంది ఈ పరీక్షలు రాయగా అందులో 31 వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందని అన్నారు.

సివిల్స్ నా లక్ష్యం : ఎర్ర అఖిల్



భవిష్యత్‌లో సివిల్స్ సాధించమే తన లక్ష్యం అని, మూడుసార్లు సివిల్స్ మెయిన్స్ రాశానని విజయం సాధించలేక పోయానని అన్నారు. ఇదే సమయంలో గ్రూప్-2 రాయడంతో మొదటి ప్రయత్నంలోనే 430.807 మార్కులతో ఓపెన్ కేటగిరీలో స్టేట్ 6వ ర్యాంక్ సాధించానని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నానని అన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే స్థిరత్వం, ఓపిక చాలా అవసరం అని, తొలి ప్రయత్నంలో ఉద్యోగం సాధించలేకపోతే నిరాశ చెందవద్దని అన్నారు. చదవుకునే సమయం నుండే పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధించే వాడినని, యువత పక్కదోవ పట్టవద్దని కెరీర్ గైడ్ లెన్స్ అందించేవాడినని అన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే మన దేశంలోనే అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించు కోకుండా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, గల్ఫ్ లాంటి దేశాల బాట పడుతున్నారని అన్నారు. అక్కడికి వెళ్ళాక పరిస్థితులు బాగలేక వెనిక్కి వచ్చి కుటుంబానికి అప్పుల బాధ మిగుల్చుతున్నారని తన బాధను వ్యక్తపరిచాడు. మండలంలో చాలా మట్టుకు ఇలాంటివి చూశానని, విద్యార్థులు దయచేసి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళి విజయం సాధించాలని కోరారు. గ్రూప్స్ రాద్దాం అనుకున్న యువతి, యువకులకు ముఖ్య సలహాలు సూచనలు అందించి తన వంతుగా సహాయం చేద్దాం అనుకుంటున్నానని అన్నారు. తల్లిదండ్రులు రాజేంధర్ ,విజయలక్ష్మి తన మేనమామ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి ప్రోత్సాహం మరువలేనిదని వారి వల్లే నేని స్థాయికి చేరుకున్నానని తెలిపారు.

ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ - బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఫత్తె అహ్మద్ కాలు ఇన్ఫెక్షన్ సోకి సర్జరీ అవసరం ఉండటంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్‌లో కాలు ఆపరేషన్ కొరకు 50 వేల రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు. ఎల్‌ఓసి కాపీ ని శుక్రవారం సంబంధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హైదరాబాద్‌లో అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

పార్టీ శ్రేణుల మధ్య

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

హైదరాబాద్‌లోని స్వగృహంలో శుక్రవారం తన పుట్టినరోజు వేడుకలను మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ఘనంగా జరుపుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేకును కట్ చేశారు.ఈ సందర్భంగా ఆయనకు బాల్కొండ నియోజకవర్గంలోని ఆయా మండలాల నుండి తరలి వెళ్లిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, నాయకులకు, అభిమానులకు ప్రశాంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కలిసి హెూలీ సంబరాల్లో పాల్గొని బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మండలకేంద్రంలో...

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బాల్కొండ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో చౌట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలావత్ ప్రకాష్, మాజీ సర్పంచ్ దయ్య దేవయ్య, నాయకులు బద్దం రాజశేఖర్, ఏనుగు రాజేశ్వర్, సదాశివ గౌడ్, పాలెపు రవి కిరణ్, తెడ్డు రాజన్న, కోనాపూర్ పురుషోత్తం, అవారి గంగారెడ్డి, కటికే శ్రీనివాస్, తీగల హరీష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు


కేక్‌తినిపించుకుంటున్న నాయకులు

మానాలలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు...

బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం మానాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ రుద్రంగి మండల అధ్యక్షులు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చిత్రంతో కూడిన కేక్‌ను ఏర్పాటు చేసి కట్ చేశారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, మాజీ ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధుసూదన్, మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మర్రిచెట్టు దేవస్థానం ఆలయంలో ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజా కార్యక్రమలు చేపట్టారు. మండలంలోని నాగంపేట్, రెంజర్ల, వేంపల్లి, వెంచిర్యాల, నల్లూర్, కొత్తపల్లి గ్రామాలలో సైతం పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో-అప్షన్ సభ్యులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కేక్ తినిపించుకుంటున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మెండోర

మెండోర బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి బాల్కొండ శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి నాగంపేట్ శేఖర్ రెడ్డి కేక్‌కట్‌చేసి నాయకులకు స్వీట్లు తినిపించి ఘనంగా జన్మదిన సంబరాలు చేసుకున్నారు. అనంతరం శేఖర్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మిస్బొద్దిన్, సామ గంగారెడ్డి, ఉప సర్పంచ్‌లు మచ్చర్ల రాజరెడ్డి, సంపంగి సతీష్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ బాబా, నాయకులు నవీన్ గౌడ్, వెంకట్ రెడ్డి, గంగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


కేక్ కటింగ్‌లో పాల్గొన్న నాయకులు

ఎమ్మెల్యే వేముల జన్మదిన వేడుకలు

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీమంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూషణం, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్ రెడ్డి, పార్టీ నాయకులు దాసరి వెంకటేష్, ఎం.ఏ షాహిద్, రామరాజు గౌడ్, సయ్యద్ ఫయాజ్ అలీ, సాగర్ యాదవ్, శరత్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, గాండ్ల రాజేష్, షేక్. ఆరీఫ్ పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న నాయకులు

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
శనివారం | మార్చి 15, 2025 | www.navatelangana.com

బెల్ట్ షాప్‌లో మద్యం పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-కామారెడ్డి
గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని మాచారెడ్డి ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు వారి షాపులను రైడ్ చేసి వారి షాపులో అక్రమంగా అమ్మడానికి నిలువ ఉంచిన మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ రెండు షాపులలో సీజ్ చేసిన మద్యం విలువ సుమారుగా 9000 రూపాయలు వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి


భోజన్న మృతదేహం

నవతెలంగాణ-మాక్లూర్
ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గుంజిలి గ్రామానికి చెందిన గోపు భోజన్న (50) శుక్రవారం పంట పొలానికి నీరు పెట్టేందుకు గానూ వాగులో పైప్ పిట్టింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

కలర్‌ఫుల్

ఉమ్మడి జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు

- పాల్గొన్న చిన్నాపెద్దా
- వీధుల్లో యువతీయువకుల కేరింతలు
- బ్యాండు చప్పళ్లతో నృత్యాలు

సదాశివనగర్‌లో హోలీ వేడుకల్లో చిన్నారుల చిందులు




నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి పలు గ్రామాల్లో కామదహనం నిర్వహించారు. కులమతాలకతీతంగా ప్రజలు హోలీ వేడుకలను చేపట్టారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు గ్రామాల్లో డీజేలు, బ్యాండ్‌లను ఏర్పాటు చేసుకుని నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. అలాగే కొన్ని గ్రామాలలో కుస్తీ పోటీలను సైతం నిర్వహించారు.

– నవతెలంగాణ-విలేకరుల బృందం


తాడ్వాయి : యూత్ సభ్యుల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు


రెంజల్ : తాడ్‌బిలోలిలో..


ఎడపల్లి : మంగల్‌పాడ్ గ్రామంలో హోలీ వేడుకల్లో మహిళలు, చిన్నారులు


రామారెడ్డి : నీటితొట్టిఓ స్నానాలు చేస్తున్న చిన్నారులు


రాజంపేట్ : ఆరెపల్లి గ్రామంలో చిన్నారుల సంబురం


బోధన్ : కుమ్మన్‌పల్లిలో..


తాడ్వాయి : హోలీ వేడుకల్లో చిన్నారులు


దోమకొండలో..


గాంధారిలో..


మద్నూర్‌లో చిన్నారుల సందడి


లింగంపేట్‌లో..


కామారెడ్డి : టేక్రియాల్‌లో..


కామారెడ్డి : ఒకరికొకరు రంగులు పూసుకుంటున్న చిన్నారులు


నిజామాబాద్‌సిటీ : బైక్‌లపై ర్యాలీగా తిరుగుతూ హోలీ ఆడుతున్న యువత


పోతంగల్‌లో..


కామారెడ్డి : రామారెడ్డి రోడ్డులో గల మోడల్ కాలనీలో..

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- వాహనాల తనిఖీలో ఎస్సై విజయ్ కొండ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మద్నూర్
వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్సై విజయ్ కొండ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర బార్డర్ ప్రాంతంలో వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు, వాహనదారుల లైసెన్సులు పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో పలువురికి జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, అలాంటి వాహనదారులకు జరిమానాలు విధిస్తామన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.5,230నగదు, నాలుగు సెల్‌ఫోన్స్ స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని హసకొత్తూర్ గ్రామ పరిధిలోని మారుతినగర్ సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.5,230 నగదు, నాలుగు సెల్ ఫోన్‌లను, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. పట్టుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ జల్సాలు, సరదా కోసం పేకాడుతూ కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పేకాట మూలంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని, పేకాట ఆడితే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మొరం టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు


మొరం తరలిస్తున్న టిప్పర్

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో మొరం రవాణాపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులో మొరం తవ్వకాలు నిర్వహిస్తూ గ్రామ ప్రధాన వీధుల నుంచి అధిక లోడుతో ప్రమాదకరంగా టిప్పర్లను నడుపుతున్నారని స్థానికులు ఆరోపించారు. నిర్భయంగా రవాణా కొనసాగడం వల్ల గ్రామ రహదారులు దెబ్బతింటున్నాయని, ప్రమాదాలు కూడా జరగవచ్చని గ్రామస్తులు భయపడుతున్నారు. మొరం వ్యాపారులను గ్రామస్తులు నిలదీయడంతో వారు అనుమతులు ఉన్నాయని సమాధానం ఇచ్చారు. సెలవు దినాల్లో ప్రభుత్వం ఎలా అనుమతులు ఇచ్చిందో స్పష్టత లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామస్తులు ఎమ్మార్వోను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందించలేదని తెలిపారు. ఇలాంటి అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలు తగ్గిపోతాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సత్వరమే అధికారులు స్పందించి, వడ్డేపల్లిలో మొరం రవాణాను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రధాన చౌరస్తాలో టిప్పర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నవతెలంగాణ-రెంజల్
మండలంలోని నీలా గ్రామ శివారులో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రెంజల్ ఎస్ఐ ఈ సాయన్న తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.